# రోజుల పిల్లవాడికి పాన్ కార్డ్!

పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొన్న వెంటనే జారీ చేయడం అన్నది ఇటీవలి కాలంలో సర్వసాధారణమై పోయింది. పర్మినెంట్ అకౌంట్ నెంబరు పొందాలంటే వయస్సుతో నిమిత్తం లేకపోయినా అతి చిన్న వయస్సులోనే పాన్‌కార్డ్ పొందిన వ్యక్తిగా 20 రోజుల వయస్సున్న అన్మయ్ సింగ్ రికార్డు స్థాపించాడు. ఈ సంఘటనకు చెందిన వివరాలు....



లక్నోకు చెందిన అన్మయి సింగ్ ఏప్రిల్ 24వ తేదీన జన్మించాడు. ఆ పసిగుడ్డుకు ఇన్‌కమ్ టాక్స్ అధికారుల పాన్ కార్డ్ జారీ చేశారు. అన్మయి సింగ్ పుట్టిన రోజునే క్యాజువల్‌గా పాన్ కార్డు కోసం దరఖాస్తు చేశాం అని ఆ పిల్లవాడి తల్లిదండ్రులు తెలిపారు. ఏదో మామూలుగా మేం అప్లయ్ చేస్తే అధికారులు 20 రోజులకల్లా అన్మయ్ సింగ్ పేరిట పాన్ కార్డ్ జారీ చేశారని వారు తెలిపారు. నాకు తెలిసినంత వరకూ అన్మయ్ సింగ్ మాత్రమే అతి చిన్న వయస్సులో పాన్‌కార్డ్ సంపాదించాడని అతని తండ్రి సుశీల్ కుమార్ సింగ్ తెలిపారు. తన కొడుకు పేర కొంత మొత్తం ఫిక్స్‌డ్ చేయాలన్న ఉద్దేశంతో పాన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసినట్లు ఆయన చెప్పారు. పాన్‌కార్డ్ రావడానికి కొంత సమయం పడుతుందని తాము భావించామని, అయితే అది చాలా త్వరగా రావడంతో తమ పని సులువైందని ఆయన వివరించారు. పిల్లల పేరు మీద డబ్బు ఫిక్స్ చేయాలంటే పాన్‌కార్డ్ అవసరమవుతుందని తమ లాయర్ చెప్పాడని, అందుకే అన్మయ్ సింగ్ పేరిట పాన్‌కార్డ్ పొందామని ఆయన అన్నారు.

# అతి పెద్ద కుందేలు మృతి....



మామూలు కుందేలు చనిపోతే పెద్దగా చెప్పుకునేది ఏమీ ఉండదు. కానీ ఇక్కడ చనిపోయింది. ప్రపంచంలోనే అతి పెద్దదిగా రికార్డయిన కుందేలు. ఓ టెలివిజన్ షో చేస్తూ మధ్యలో గుండె నొప్పి వచ్చి కుందేలు చనిపోయినట్లు దాని యజమాని అన్నెట్టే ఎడ్వర్డ్స్ తెలిపింది. నాలుగు అడుగుల పొడవు, అత్యధిక బరువు కలిగిన అమ్మె (ఇది కుందేలు పేరు) ప్రపంచంలోనే అతి పెద్ద కుందేలుగా నమోదైందని చెప్పారు. అమ్మెకు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలున్నా చనిపోతుందని మాత్రం తను ఏ మాత్రం ఊహించలేదని అన్నారు. చిన్న పిల్లగా ఉన్నప్పుడు దాన్ని తను బ్రిటన్ నుంచి తీసుకువచ్చినట్లు వివరించారు. ఇప్పటి వరకూ అమ్మె 32 పిల్లలకు జన్మనిచ్చిందని అన్నారు. ప్రతి రోజూ రెండు పెద్ద ఆపిల్స్, పావుకిలోకు పైగా క్యారట్, చిన్న సైజు క్యాబేజీ పువ్వు, పెద్ద బౌల్ నిండా రాబిట్ మిక్స్ ఆహారంగా తీసుకునేదని చనిపోయే రోజు కూడా ఆహారం తీసుకుందని అన్నారు. టెలివిజన్ షోలో హఠాత్తుగా సిక్ అయిందని, ఆ రాత్రే హోటల్ రూంలో చనిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ రికార్డ్ అధికారి ఒకరు మాట్లాడుతూ అమ్మె చనిపోవడం విషాదకరం అని వ్యాఖ్యానించారు.

## 'సరసి'కత

# పార్ట్‌నర్

వైశంపాయనుడిని, అతడి భార్య సుబ్బాయమ్మనీ భోజనానికి పిలిచాడు చిన్మయం గారు. వీళ్లు వెళ్లేసరికి మరో స్నేహితుడు పురూరవుడు, అతని భార్య కుముద్వతి కూడా వున్నారక్కడ. పరిచయాలూ, కబుర్లూ అయినాక ఇంకా భోజనానికి టైముందని కేరం బోర్డు ఆడుకోమని అన్నాడు చిన్మయం గారు, బోర్డు వాలుస్తూ.

వైశంపాయనుడికి భార్య సుబ్బాయమ్మ పార్ట్‌నర్ అయితే, పురూరువుడి గారికి అతడి భార్య కుముద్వతి పార్ట్‌నర్. నాలుగు బోర్డు లయ్యేసరికి ఆట రసకందాయంలో పడింది. ''ఆ కాయిన్ వెయ్యి, ఇది క్లియర్ చెయ్'' అంటూ వైశంపాయనుడు మొదట్నించీ భార్యకి సూచనలిస్తూ వచ్చాడు. అయితే గేమ్ నెగ్గే దశలో రెడ్ తర్వాత ఫాలోయింగ్ కాయిన్ వెయ్యలేకపోయిందని ఆమెని నానా తిట్లూ



తిట్టేడు. నలుగురిలో తిట్టినందుకు సుబ్బాయమ్మ చిన్నబుచ్చుకుంది.

భోజనాలకు ఏర్పాట్లుచేస్తూ, ఓ కంట వీళ్లని గమనిస్తున్న చిన్మయం గారు సుహృద్భావ వాతా వరణం దెబ్బతింటోందని గ్రహించి, ''ఇలా క్కాదు. ఈసారి అటూ ఇటూ మారండి'' అంటూ సుబ్బాయమ్మ గారిని పురూరవుడుకి జోడుగా చేసి, కుముద్వతిని వైశంపాయనుడికి పార్ట్‌నర్‌గా కూర్చోబెట్టాడు.

ఇక ఇప్పుడు ఆట ప్రశాంతంగా నడుస్తుందని, తను అద్భుతమైన ప్రయోగం చేశానని చిన్మయం గారు చిదానందపరవశుడయ్యాడు. కాని అతడి ఆనందం ఆట్టేసేపు నిలవలేదు. చేతికింద ఉన్న సింపుల్ హేండ్ కాయిన్‌ని వెయ్యలేకపోయిందని, అది కూడా వెయ్యలేకపోతే వేస్టనీ తన పార్ట్‌నర్ కుముద్వతిని కుళ్లు మాటలన్నీ అన్నాడు వైశంపాయనుడు, ఆమె భర్త (పూర్) పురూరవుడి సమక్షంలోనే!!

*